క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 5వ రోజుకు చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట ఇచ్చిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కిరణ్, శ్రీకాంత్, నారాయణ, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేసేలా సహకరించాలని ఎమ్మార్పీ ఎస్ శ్రేణులు మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ శ్రేణులు మండల కేంద్రంలో ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు మహేశ్, మహేందర్ కొండలు, ప్రవీణ్ తదితరులు తహసీల్దార్‌ను కలిసి వర్గీకరణకు సహకరించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు.

మంచాలలో...

మంచాల: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేసేలా సహకరించాలని మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. మంగళవారం దీక్షలో ఆ సంఘం మండల ఇన్‌చార్జి పాండు మాదిగ, ఆనంద్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, నాయకుడు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షల విరాళం


ఎస్‌ఐ బాల్‌రాంకు 5 లక్షల చెక్కు అందిస్తున్న చైర్మన్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మున్సిపాలిటీ పాలకవర్గం రూ.5 లక్షల విరాళం అందించింది. ఆమగనల్లు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ రూ.5 లక్షల చెక్కును ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిలర్‌లు లక్ష్మణ్, కృష్ణనాయక్, కృష్ణయాదవ్, విజయ్‌కృష్ణ, నాయకులు శ్రీకాంత్‌సింగ్, శ్రీశైలం యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల నిరవధిక సమ్మె



సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశవర్కర్లు

కడ్తాల్: ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆశవర్కర్లు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా సభ్యులు కురుమయ్య తెలిపారు. మైసిగండి పీహెచ్‌సీ మెడికల్ అధికారి సుధీర్‌బాబుకు ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ ఆశవర్కర్ల పారితోషికం రూ.18 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాదబీమా రూ.5లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అన్నింటిని వర్తింపజేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశవర్కర్లు ఉన్నారు.

మాపై కరుణ చూపండి


గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలిపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 79వ రోజుకు చేరుకున్నాయి. 79 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదని జేఏసీ నాయకులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మా సమస్యను పరిష్కరించడానికి ఏలాంటి చర్య తీసుకోలేదని విమర్శించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా గట్టుఇప్పలపల్లిని మండలముగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో దామోదర్, రేణురెడ్డి, చంద్రయ్య, చెన్నయ్య, లక్ష్మణరావు, శివయ్య, ఆంజనేయులు, జంగయ్య, వెంకటయ్య, పవన్, యాదయ్య, కృష్ణయ్య, దైవనందం, వెంకటేశ్, పవన్‌వాల్మీకి, రంగారెడ్డితదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణపల్లిలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడు


కడ్తాల్: మైసిగండిలో పూజలు చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి తదితరులు


యాచారం: పూజలు నిర్వహిస్తున్న ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్

గణపతి బొప్ప మోరియా

గణనాథుడు ఆది దేవుడు. తొలి పూజలు అందుకొనే విఘ్న వినాయకుడు. సోమవారం నుంచి గణేశ్ నవరాత్రులను ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు ఈ మహోత్సవాలను కన్నుల పండువగా జరుగనున్నాయి. గణేశ్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు నవ రాత్రోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఆకట్టుకునే విధంగా మండపాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా గ్రామాల్లో ఎంతో భక్తి శ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– యాచారం


ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో..


చుక్కాపూర్‌లో...


మంచాలలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు


ఆమనగల్లు: రచ్చకట్ట వద్ద మార్కండేయ యూత్ ప్రతిష్ఠించిన గణనాథుడు

బీజేపీ నేతలు అభివృద్ధి నిరోధకులు

- వచ్చే ఎన్నికల్లో కాషాయ పార్టీకి బుద్ధి చెప్పాలి
- బీఆర్‌ఎస్‌లో చేరిన 200 మంది కార్యకర్తలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఆమనగల్లులో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ అభివృద్ధికి బీజేపీ నేతలు నిరోదకులుగా మారారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. అభివృద్ధికి అడ్డు తగులుతున్న కాషాయ నేతలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, ఈ సారి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరాలన్నారు. మంగళవారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో 6వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన 200 మంది జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ కుటుంబంలో చేరిన వారికి అండగా ఉంటామని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో గత కొన్నేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని, అభివృద్ధికి అడ్డు తగులుతున్న వారేవరో ప్రజలందరికి తెలుసని ఆయన అన్నారు. విద్యార్థుల కోసం కళాశాల భవనం నిర్మిస్తుంటే బీజేపీ నేతలు అడ్డు తగిలారని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీలో బీజేపీ పాలకవర్గం సహకరించకపోయినా ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. 1.50 కోట్లతో గ్రంథాలయ భవనం, 4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లుకు పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని ఆయన చెప్పారు. రూ.17.50 కోట్లతో వారం రోజులలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్, యూత్ ప్రెసిడెంట్ వెంకటేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కమటం రాధమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు తల్లోజు రామకృష్ణ, సాయిలు, మల్లేశ్, పూసల సత్యం, భాస్కర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదించాలి

తలకొండపల్లి: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ బిల్లు చట్ట సభల్లోనూ ఆమోదం పొందితే రాజకీయంగా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. దీంతో మహిళా రక్షణ, విద్య, వైద్యం లాంటి అంశాల్లో విలువైన చర్చలకు ఆస్కారం ఉందన్నారు. బిల్లు ఆమోదం పొందితే చట్ట సభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. దేశంలో మహిళా ఓట్ల శాతం పెరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హామీవుడిగా 33 శాతం మహిళా బిల్లును చట్ట సభల్లో ఆమోదిందించేందుకు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటి వరకు ఎందుకు పెట్టలేదని విమర్శించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి


సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: పల్లెల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జెడ్పీటీసీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ సుగుణ, ఉప సర్పంచ్ ముత్యాలు, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, బాలమణి, సత్తయ్య, యాదయ్య, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ. లక్ష విరాళం

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు నూతన ఆలయాల నిర్మాణం కోసం సాయంగా ఉంటానని ప్రముఖ రియల్టర్ పాండురంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్ ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణ కోసం ఆర్థిక సహాయం అందజేయాలని, ఆలయ నిర్వాహకులు పాండురంగారెడ్డిని కోరారు. తక్షణమే స్పందించిన ఆయన.. తమ తల్లిదండ్రులు భారతమ్మ, మాదవరెడ్డిల జ్ఞాపకార్థం ఆలయ పునర్నిర్మాణం కోసం సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మంగళవారం పాండురంగారెడ్డి ఆలయ నిర్వాహకులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆలయంలో వినాయకుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రంగారెడ్డి, వీరేశలింగం, మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, రాజలింగం, రామచంద్రయ్య, మల్లేశ్, కృష్ణయ్య, వీరేశ్, గోపాల్, రాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలను రెగ్యులర్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కనీస వేతనం రూ.26 వేలు అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, అలివేలు, రాజ్యలక్ష్మి, సంధ్య, లక్ష్మమ్మ, శాంతమ్మ, రజిత, స్వరూప, సువర్ణ, అంజమ్మ, నాగశిరోపాణి తదతరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. పెద్దఅంబర్‌పేట నుంచి కోహెడా దారిలో చాకలి వాగు వద్ద వంతెన నిర్మాణం, పెద్ద అంబర్‌పేట-పసుమాముల రోడ్డు విస్తరణ, జీవీఆర్ కాలనీ మెయిన్ రోడ్డుపై సీసీ రోడ్డు, కుంట్లూర్ మెయిన్ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

చట్ట సభల్లో రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య


కొప్పు సుకన్య

యాచారం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయమని, మహిళలంతా ప్రధాని నరేంద్రమోదీకి రుణపడి ఉంటారని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనేక రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఇతర పార్టీలు ఓట్ల కోసం మహిళలను మాయమాటలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా మద్దెలమ్మ బోనాలు


చుక్కాపూర్‌లో బోనాలతో మహిళలు, భక్తులు

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్‌లో మంగళవారం మద్దెలమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వినాయచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పద్మశాలీల ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. బాజాభజంత్రీలు, డప్పుల చప్పుళ్లతో భారీ ర్యాలీగా మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాన్ని చల్లంగా చూడాలని, పాడిపంటలు బాగా పండే విధంగా దీవించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల ఆటపాట, పోతరాజుల విన్యాసాలు పలువురిని అలరించాయి. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రజలు ఉత్సాహం పాల్గొన్నారు.

భూమికి భూమి ఇవ్వాలి..

- బాధ్యులందరికీ పరిహారం చెల్లించాలి
- భూ నిర్వాసిత రైతుల డిమాండ్


ధర్నా చేస్తున్న బాధితులు

అబ్దుల్లాపూర్‌మెట్: తమ భూములను లాక్కున్న ప్రభుత్వం.. క్రషర్ల యజమానులను అప్పగించింది కానీ.. తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తూ, లాక్కున్న భూమికి నష్టపరిహారంగా భూమికి భూమినే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాలకు చెందిన సర్వే నంబర్ 268లో భూములు కోల్పోయిన రైతులు చేస్తున్న దీక్షకు 400ల రోజులు పూర్తి అయింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తమ ప్రాణాలకు హాని కలిగించే మైనింగ్ జోన్‌ను రద్దు చేయాలని శాంతియుతంగా సుదీర్ఘకాలంగా పోరాడుతున్నప్పటికీ.. ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ జోన్‌లో మొత్తం 209 మంది రైతులకు చెందిన వందల ఎకరాల భూమిని అక్రమంగా మైనింగ్ జోన్‌కు అప్పగించిన ప్రభుత్వం.. తమకు నష్టపరిహారం చెల్లించేందుకు మాత్రం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

పరిహారం అందరికీ ఇవ్వాలి..

ఇటీవల 50 మందికి నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు ప్రటనలు ఇచ్చారని, అయితే ఆ 50 మందికి కూడా ఇప్పటి వరకూ ఒక్క రూపాయి నష్టపరిహారం అందలేదన్న రైతులు, గత ఏడాదిగా ధర్నా చేస్తున్న 209 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమ మధ్య బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు తమ మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతులందరికీ నష్టపరిహారం అందించకపోతే పార్టీ నేతల ఆటలు సాగనివ్వమని రైతులు నేతి కృష్ణ యాదవ్, పావురాల అయిలయ్య, అబ్బవతి మణెమ్మ, బస్వమ్మ, లక్ష్మమ్మ, కిష్టయ్య, చాకలి భారతమ్మ, అండాలు హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఇన్‌చార్జిగా గాంగ్మీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా మణిపూర్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ హోంమంత్రి గైఖాంగంమ్‌గాంగ్మీని నియమించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిరంజన్‌రెడ్డి, గైఖాంగంమ్ గాంగ్మీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 22 ఏళ్లుగా ప్రజా సేవా చేస్తున్నానని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ కోలా నాగేష్ బీఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం తన రాజీనామా పత్రాన్ని స్నేహితుల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్యకు అందజేసినట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం కొంగరకకలాన్ తాండను అభివృద్ధి చేయలేకపోయనని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఏ పార్టీలో చేరబోనని వార్డు అభివృద్ధి కాకుంటే కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు.

అంగన్‌వాడీలకు సీపీఎం మద్దతు

హయత్‌నగర్: అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మెకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, నర్సింహ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అంగన్‌వాడీ సూర్‌వైజర్లు వర్కర్లపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, ప్రభాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: గ్రామీణా ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ కుమార్ అన్నారు. నిరుపేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రధనలో ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ సభ్యులు కొత్త శంకరయ్య జ్ఞాపకార్థం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సకాలంలో మందులు వాడి ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా జలాల కలశాల పంపిణీ


ఆమనగల్లులో కృష్ణాజలాల కలశాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనిత

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని అన్ని గ్రామాలకు కృష్ణా జలాల కలశాలను మంగళవారం ఆమనగల్లు ఎంపీపీ అనిత పంపిణీ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించిన అనంతరం కృష్ణజలాల కలశాలను మండలాలకు అందజేశారు. ఆమనగల్లు మండలానికి 8 జలాల కలశాలను ఇవ్వగా ఎంపీపీ అనిత వాటిని గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్, ఎంపీఓ శ్రీలత, సర్పంచ్‌లు లక్ష్మణ్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం


నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం ఆమనగల్లు బీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణ, చెన్నంపల్లి సర్పంచ్ శ్రీనయ్యలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాశ్, తిరుపతయ్య, గోరటి శ్రీనివాస్, శివకుమార్, నాగులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన గోలి

ఆమనగల్లు: మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్‌లను సోమవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ సుభాశ్, నాయకులు నాగులునాయక్, నూకం వెంకటయ్య, శివకుమార్, చింటు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

పార్టీ సీనియర్ నేత ఆచారి

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచారీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని తెలిపారు. ఒకే పార్టీలో ఉండి గత 40 ఏళ్లుగా ప్రజలకు సేవలు చేస్తున్నానని, బీజేపీకి ఓటు వేసి గెలుపించాలని కోరారు. బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి రూ. కోటి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి


మండల సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: నియోజకర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మరో రూ. 8.25 కోట్లను మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన మంగళవారం ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల లోపే ఈ నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలానికి మరో కోటి రూపాయలను ప్రత్యేకంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక కేంద్రంగా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సుందరీకరించేందుకు 18.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. కలెక్టరేట్, ఆర్డీఓ, పీఆర్ డీవిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్ వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి అంశాలపై ఏలాంటి రాజీలేకుండా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మ, తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ పీఆర్ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, మండల ఈఈ ఇంద్రసేనారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.